# వెన్నెల వసంతం


శ్రీసాహితి

ప్రియమైన నీకు,
ఎవరా! ఈ కాలంలో ఇంత ఓపిగ్గా ఉత్తరం రాస్తున్నది అనుకుంటున్నావా? త్రిప్పి చూడకు, ముందు ఉత్తరం చదువు. ఎక్కడో ఈ చేతివ్రాతను చూసిన జ్ఞాపకం కదా... ఎప్పుడో ఇంత కమాండింగ్‌కి లొంగిపోయిన ఫీలింగ్ కదా. అరే... నేనే... నీవు మరచినా మరచిపోనివ్వదలుచుకోని నీ నేస్తాన్ని..

నీ ఇష్టాన్ని.. పదేళ్ళ క్రితం వసంతం లాంటి, వెన్నెలలాంటి వణికించే చలిలో చిన్న చలిమంట లాంటి, మండు వేసవిలో మోవిపై పడిన చిన్న చినుకులాంటి.. నీవు అలా వెతుకుతూ వెతుకుతూ అంతెందుకు, ఈ ఉత్తరాన్ని అలా అలా మున్ముందుకు చదువు కుంటూ పోతే నీ మనసంతా నిండిపోయే నీ చెలిని.. నెచ్చెలిని..

ఆనాటి మన పరిచయం, ప్రణయం, వియోగం, చివరికి విడిపోవడం అన్నీ






నీముందు సజీవంగా నిలపాలని నేను చేస్తున్న ఈ ప్రయత్నం సఫలం కావాలని, నాకు బెస్ట్ ఆఫ్ లక్ చెప్పవూ... అప్పట్లో ప్రతి ఎగ్జామ్ రోజూ ఎదురొచ్చి మరీ 'బెస్టాఫ్ లక్' చెప్పేవాడివి కదా!

ఏయ్! నీకు ఉత్తరం వ్రాయాలని వుంది. కాని మనసులో ఏంటో ఒకటే గజిబిజి. బిజి బిజిగా అల్లుకుంటున్న అల్లిబిల్లి మాటలు. తీరా పేపర్ పెన్నూ తీసుకుంటే ఎక్కడలేని నిస్తేజం. మళ్ళీ ఇన్నేళ్ళకు నీకు ఉత్తరం వ్రాయాలని అనిపించడం నాలో ఏదో తెలియని ఉద్వేగం.

ఈ ఆదివారం మేము తిరుమలకు నడిచివెళ్ళాం. ఆ వెళ్ళడం వలన వచ్చిన గొడవే ఇదంతా. ఎందుకో తెలుసా.. దారి పొడవునా ''ఎర్ర తురాయి'' చెట్లే. అంటే ''డెలోనెక్స్ రీజియా''. దారికి రెండువైపులా పెద్ద పెద్ద చెట్లు పచ్చగా, వాటి చివర ఎర్రెర్రగా విరగబూసిన పువ్వులు. ముద్దుముద్దుగా, ఎర్రెర్రగా వున్న ఆనాపూలను చూస్తూ మనస్సు వెనక్కెనక్కి పరిగెడుతూ గుండెంతా



## కోటిన్నర తీసుకున్న కరీనా

కరీనా కపూర్ ఇటీవల ఒక సినిమాకు కోటిన్నర రూపాయల పారితోషికం తీసుకుంది. బాలీవుడ్‌లో హీరోలతో సమానంగా డబ్బులు తీసుకుంటున్న వారిలో నెంబర్‌వన్ ఐశ్వర్యా, నెంబర్ టూ కరీనా. నటనలో తానెన్నడూ ఫెయిల్ కాలేదని, కథాబలం లేకపోతే అది తన తప్పెలా అవుతుందని కరీనా వాదిస్తోంది. సినిమా హిట్ అయితే తన ప్రతిభ, ఫెయిలయితే కథ లోపం - బాగుందీ అమ్మడి వాదన.

తెలియని ఉద్వేగంతో కొట్టుకోసాగింది.

చివరికి అలా వెళ్ళిన నా మనస్సు పందొమ్మిది వందల తొంభై రెండవ సంవత్సరం, ఎస్వీ మెడికల్ కాలేజ్ ఉమెన్స్ హాస్టల్ మిద్దెపైన ఆగిపోయింది. అక్కడే కదా నేను మొదటిసారిగా ఈ పువ్వులను చూసి ఉబ్బి తబ్బిబ్బై జీవితంలో మొట్టమొదటి కవిత వ్రాసింది. అది నీగురించి కావడం ఇక్కడ విశేషం. మా హాస్టల్ మిద్దెపైనుంచి చూస్తే తిరుమల మెట్ల దారి బాగా కనిపించేది. ఈ తురాయి చెట్లు చాలా అందంగా దారివెంట దర్శనమిచ్చేవి.

మే, జూన్ నెలల్లో నాకు ఇదేపనిగా వుండేది. వాటి అందం చూస్తూ మైమరచి పోయేదాన్ని. ఏవేవో పిచ్చి పిచ్చి ఊహాగానాలు చేస్తూ, మనసులో పదాల దొంతరలు పేర్చితే అవి వాక్యాలుగా రూపొంది చిన్ని చిన్ని కవితలయ్యేవి. సరిగ్గా అలాంటి ఊహాగానాల్లోనే ఈ చిన్ని కవితల్లోనే ఏదో జ్ఞాపకం నన్ను పలకరించింది. ఎవరో నన్ను చూసి నవ్వినట్లనిపించి ఆలోచిస్తే, ఆ చిరునవ్వుకు చిరునామా నాలుగేళ్ళ క్రితం నాకు పరిచయమైన నీవని తెలిసింది. నన్ను వెంటాడిన నీ చూపులు, అభిమానంగా మనసును తాకుతున్నట్లనిపించే నీ మాటలు గుర్తొచ్చాయి. చిన్న ఆశ నాలో మొలకెత్తింది. అదే ''ప్రేమించబడడం'' అనే ఆశ. ''నీకు నేనంటే ఇష్టం కదా. చెప్పకపోతే మాత్రం నాకు తెలియదా. ఆ వెటర్నరీ కాలేజీలో వున్న ఆరు నెలల్లోనే ఎన్నో సార్లు నన్ను పలకరించాలని ప్రయత్నించడం, దొంగగా చూడడం తెలియని విషయమా. సునీత, కవిత నన్ను ఎలా ఏడిపించేవారు, నీవు నాకు లైన్ వేస్తున్నావని, కాని నేను మాత్రం సీరియస్‌గా వుండేదాన్ని. అప్పట్లో నా లక్ష్యం అది కాదు. ఎమ్‌సెట్‌లో కొద్దిలో మిస్ అయిన మెడిసిన్ సీటు''. అందుకే నేను నిన్ను పట్టించుకోలేదు.

కాని నీవు, నేను ఇద్దరం మళ్ళీ ఎంట్రెన్స్ రాయాలని సెమిస్టర్ డ్రాప్ చేసి వెళ్ళిపోవడం, నీవు నా అడ్రస్ అడిగి తీసుకున్నావు కాని ఉత్తరాలు రాయవద్దని చెబితే నీవు రాయలేదు. నేను నా సర్టిఫికెట్స్ కోసం వెటర్నరీ కాలేజీకి వెళితే నీవు అప్పటికే వచ్చి వెళ్ళిపోయావని, నా కోసం అడిగావని సునీత చెప్పింది. అప్పట్లో నీవు నామీద ఇంట్రెస్ట్ చూపిస్తూ వుంటే నేను ముభావంగా వుండిపోయాను. కాని ఇప్పుడేమో నీ ప్రేమ కావాలనిపిస్తుంది. నీవు మీ ఊరిలోనే చేరావో, ఇంకెక్కడైనా చేరావో నాకు తెలియదు. కాని మీ ఊరి పేరు తెలియడం నాకో ఊరట. ఉత్తరం రాయమని మనస్సు ఉత్తర్వునిచ్చినా, ఉరకలు వేసే మనసుకు ఏదో సంశయం కళ్ళెం వేస్తోంది. అలా కొన్ని నెలల పాటు ఊగిసలాడి చివరికి నిన్ను మిస్ చేసుకోవడం ఇష్టం లేక లెటర్ రాశాను. రిజిస్టర్ పోస్ట్ చేస్తే చేరుతుందని, మీ హాస్టల్‌కు పోస్ట్ చేశాను. చేరితే తప్పక ఉత్తరం రాయమని నా చిరునామా దానికి జత చేసి, ఎదురు చూపును నేనే మిగుల్చుకున్నాను. నా అదృష్టమో దురదృష్టమో అది నీకు చేరడం, అంతవరకు మన మధ్య సాగిన పొడి పొడి మాటలు, భావాలు అక్షరరూపంలో పేపర్ మీద పెట్టి ఉత్తర పర్వాన్ని సాగించాం. అలా అలా దాదాపు ఒకటిన్నర సంవత్సరం పాటు సాగిన ఈ ఉత్తరాయణం నీ రాకతో ఆగిపోయింది.

నీవు తిరుమలకని నీ ఫ్రెండ్‌తో కలిసి వచ్చి మా హాస్టల్‌కు వచ్చావు. తిరుమలకు నేను కూడా రావాలని ప్రపోజ్ చేశావు. అప్పట్లో ఎంత భయమో... నీతో మాట్లాడేది ఎవరైనా చూస్తారేమో... తెలిసిన వాళ్ళు ఎవరీ అబ్బాయి అని అడిగితే ఏం చెప్పాలో.. ఇలా ఆలోచించుకుంటూనే ధైర్యంగా మా ఫ్రెండ్‌తో కలిసి నీతో తిరుమలకు వచ్చాను. నడక దారిలో నీవు ఎన్నో కబుర్లు చెప్పావు. గల గల మాట్లాడుతున్న నిన్ను చూస్తుంటే నాకు చాలా ముచ్చటేసింది. దేవునిపై భక్తి, నమ్మకం తక్కువగా వున్న నేను ఆరోజు మహా భక్తురాలిగా మారిపోయాను. ఆకలికి అస్సలు తట్టుకోలేని నేను, స్వామి దర్శనం అయ్యేంతవరకు ఏమీ తిననని, నీవు చెబితే నీ మాటే నాకు వేదవాక్కయింది. నీతో వుంటే టైమే తెలియలేదు. ఆ ఒక్క రోజులో నేను నీమీద మరింత ప్రేమను, నమ్మకాన్ని పెంచుకున్నాను. ఎలాగో ఒకలా నీ మాటలు వింటూ, నీ సమక్షంలో వుండ గలిగితే చాలు అనిపించింది.

ఒక్కోసారి మెట్లు ఎక్కలేక అలసటతో నేను ఆగిపోతే చేయి అందించే వాడివి. ఆ చేతిని అందుకోకుండా నేను కోపంగా చూస్తుంటే నవ్వేసి ''అబ్బో! బంగారం కరిగిపోదులే'' అంటూ చేతిని లాక్కునే వాడివి. స్వామి దర్శనానంతరం గుడి ముందు ఊయల సేవ జరుగుతుంటే అక్కడ కూర్చున్నాం. ''ఏయ్ వసూ! మళ్ళీ మనం ఎప్పుడు ఇలా ప్రక్కప్రక్కనే కూర్చుని దేవుణ్ణి దర్శించుకుంటాం. గుడిలో నేను స్వామివారిని ఏం కోరుకున్నానో తెలుసా? ఈ వసూని నాకు స్వంతం చెయ్ స్వామీ అని''.

ఆ మాటలకు నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మళ్ళీ నీవు ''అంతేకాదు, చేయిపట్టుకుంటేనే కాదు గట్టిగా వాటేసుకుని ముద్దుపెట్టుకున్నా అభ్యంతర పెట్టని రోజుని నా జీవితంలో ప్రసాదించు'' అని మరి వసూ... నా కోరిక తీరుతుందంటావా?'' అంటూ చిలిపిగా నావైపు చూస్తుంటే నా కళ్ళల్లోని తడి నీకు కనిపించకుండా తల దించుకుని ''ఏమో! నాకేం తెలుసు?'' అన్నాను.

''నీవు చెబితే నాకు ధైర్యంగా వుంటుంది. మనమిద్దరం మెడిసన్ కంప్లీట్ చేసి పిజి సీట్లు సంపాదించాం. అంతవరకు నీవు పెళ్ళి చేసుకోనని ఇంట్లో వాళ్ళకి చెప్పు. అప్పుడు మన పేరెంట్స్‌కి చెప్పి వాళ్ళని ఒప్పించి పెళ్ళి చేసుకుందాం'' అని చాలా నమ్మకంగా చెప్పావు.

ఇంకో జ్ఞాపకం, తిరుమల మెట్లు దిగి వస్తూ వుంటే, ఒక చోట నిలబడి దిగువ తిరుపతిలో వీధుల వెంబడి వెలిగిన లైట్లు ఎంతో అందంగా కనిపిస్తుంటే అందరం మైమరచిపోయి చూస్తూ వుండిపోయాం. ఆ చీకటిలో నా ప్రక్కనే ''వసూ'' అన్న నీ పిలుపుతో ఉలిక్కిపడ్డాను. ఏంటన్నట్లు చూస్తుంటే మెల్లగా, ఎవరూ చూడకుండా నా చేతిని తీసుకొని నీ గుండెపై పెట్టుకుని తరువాత చటుక్కున ముద్దు పెట్టుకున్నావు. ఒక్క క్షణం నాలో ఎప్పుడూ ఎరుగని

మైమరపు. కాని ఆ చల్లగాలిలో కూడా నాకు వళ్ళంతా చెమటలు పట్టేస్తూ వణుకుతూ వుంది. ''వసూ ఏంటి అలా అయిపోయావు'' అంటూ భుజం మీద చేయి వేసి దగ్గరకు తీసుకొని ఒక్క క్షణంలో వదిలేశావ్. నేను ఆ షాక్ నుంచి తేరుకోడానికి ఆలోచిస్తూ వుండిపోయాను. తలెత్తి చూసేసరికి, నవ్వుతూ నీవు కనిపించేసరికి కోపంగా ''నా మొహంలో ఏముంది? అక్కడ చూడు'' అన్నాను.

కాని నీవు మాత్రం నిశ్చలంగా ఏ బెరుకూ లేకుండా నన్నే తేరిపారా చూస్తూ ''ఆ అందమంతా నాకు నీలో కనిపిస్తోంది'' అన్నావు. 'ఏంటి' అంటూ చురుగ్గా చూసే సరికి ''అదే నీ కంటి పాపల్లో ఆ వెలుగు జిలుగులన్నీ కనిపిస్తున్నాయి. అసలే ఆల్చిప్పల్లాంటి కళ్ళు కదా. ఆ కళ్ళతో జింకపిల్లలా బెదురు బెదురుగా చూసే కదా మమ్మల్ని పడగొట్టింది'' అంటూ చివరి వాక్యం గొణిగావు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో జ్ఞాపకాలు. నీతో గడిపిన ప్రతి క్షణం ఇన్ని సంవత్సరాలైనా మరిచింది లేదు. అలా నీ మాటలు, నీ ప్రేమ నన్ను వివశురాల్ని చేస్తూ నా మనసులోని భావాలకు ఓ రూపాన్ని ఇచ్చి అది నీ ఎదుట వుంచాలని నేను యత్నం చేస్తుంటే అలవోకగా నీ నోటినుంచి నీ మరదలి గురించి విని అవాక్కయ్యాను.

ఆమెకు నీవంటే ఇష్టమని, నీకు తనంటే పెద్ద ఇంట్రెస్ట్ లేదని, కాని మీ పెద్ద వాళ్ళు చిన్నప్పుడే మీ ఇద్దరికి పెళ్ళని అనుకున్నారని చెప్పావు.

ఆ షాకుతో కలల్లో తేలిపోతున్న నేను భూమిపైకి వచ్చిపడ్డాను. నాలో వివేకం మేల్కొంది. మా ఫ్యామిలి గురించి ఆలోచించాను. మా నాన్నగారు అసలు ఈ ఇంటర్‌కాస్ట్ మ్యారేజీకి ఒప్పుకోరు ఇంట్లో గొడవలు అవుతాయి. చెల్లెళ్ళ భవిష్యత్తు దెబ్బ తింటుంది. అటు నీ మరదలి మనస్సు గాయపడుతుంది. త్యాగమో, భయమో, పిరికితనమో మరేదో అని చెప్పను గాని ఇంతటితో నా మనసులో మొలకెత్తిన ప్రేమకు స్వస్తి చెప్పాలనుకున్నాను. నేను భవిష్యత్తులో మిగిలి వుండాలంటే, నన్ను నేను కోల్పోకూడదని అనుకుంటే, నీకు దూరమవడమే సరైన నిర్ణయం అని అనిపించింది.

అందుకే తరువాతి రోజు నీవు ఎన్నో కబుర్లు చెబుతున్నా ముభావంగా వుండిపోయాను. ''నాలుగు నెలల తరువాత అమ్మ నాన్నని తీసుకొస్తాను, అమ్మకి నిన్ను చూపించాలి. అమ్మ నా ఇష్టాన్ని కాదనదు తెలుసా'' అని చెప్పావు. ఆ మాటలు విని నా ప్రమేయం లేకుండానే పెద్దవైన నా కళ్ళను చూసి ''అసలే పెద్దవి, వాటిని మరింత పెద్దవి చెయ్యడం ఎందుకట'' అన్నావు.

నేను బిడియంగా, చెక్కిట రాలబోతున్న కన్నీటి చుక్కను అదిమిపెట్టి బలవంతంగా చిరునవ్వు నవ్వాను. నీవు అంతటితో ఆగలేదు.

''వసూ! ఒక్క ముద్దిస్తే నీ సొమ్మేం పోయిందమ్మా. నీకోసం ఇంతదూరం వచ్చానే'' అన్నావు.

ఇంక నాకు కన్నీరాగలేదు. నేను మనసువిప్పి నా ప్రేమను నీ ముందు చెప్పకపోవచ్చు. కాని నీవంటే నాకెంత ఇష్టమో నాకు తెలుసు. నీక్కూడా తెలుసు. నా కన్నీళ్ళు చూసి నీవు పడిన కంగారు చూసి నిన్ను మభ్యపెట్టడానికి ''అవన్ని పెళ్ళాయ్యాకే'' అన్నాను. నీవు తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ ''ఓస్ అంతేగా! అయినా అప్పుడు నిన్నేంటి అడిగేది. అంతా నా ఇష్టమే కదా. అప్పుడు నీవు నా ఒళ్ళో వుంటావు. నా కళ్ళలోంచి కన్నీరొలికి నీ చెక్కిళ్ళకు ముద్దెట్టుకుంటాయి'' అన్నావు. ఆ మాట ఎందుకన్నావో గాని నాలో మళ్ళీ అలజడి. ''నీకు నిజంగానే నీ మరదలంటే ఇష్టం లేదేమో, నేనంటేనే ఇష్టమేమో. ఎంత ఇష్టం లేకపోతే ఎంత సున్నితంగా ఆలోచించకపోతే ఒక అబ్బాయి నోటివెంట ఈ మాటలు వస్తాయి'' అనుకున్నాను.

సాయంత్రం స్టేషన్‌లో నీకు స్వీట్ ప్యాకెట్ ఇచ్చి, ట్రైన్ దగ్గర వీడ్కోలు చెప్పి వచ్చేస్తుంటే నాకు ముందుకు అడుగు పడలేదు. అదే చివరిసారి మనం కలుసుకోవడం అని నాకు తెలుసు. కాని నీకు తెలియదు ట్రైన్ ఎక్కి చెయ్యి ఊపుతున్నప్పుడు నీ కళ్ళల్లోని తడిని చూసి నా మనసు తల్లడిల్లింది. నాలో చైతన్యాన్నంతా నీతో పాటే తీసుకొని పోతున్నట్లనిపించింది. నీ మాటల గలగల నా చెవుల్లో మ్రోగుతూనే వుంది. ప్రాణం లేని మనిషిలా హాస్టల్‌కు తిరిగి వచ్చాను. కొన్ని రోజుల వరకు నేను మనిషిని కాలేకపోయాను. కాని ఆ సమయంలోనే నేను చాలా ఆలోచించాను. నా నిర్ణయం ఇంకా బలపడింది. నీకు ఉత్తరాలు రాయకూడదని అనుకున్నాను. కొన్ని రోజులు చూద్దాం. కుదరకపోతే తరువాత చూద్దాం. కాని నిర్ణయం తీసుకున్నంత సులభం అనిపించలేదు నిన్ను మరచిపోవడం. నీవు గుర్తొచ్చినప్పుడంతా ఒక కవిత రాసేదాన్ని. దాన్ని మా ఫ్రెండ్స్ చూసి ''వహవ్వా... వహవ్వా...'' అనేవారు.

మరీ నీ వియోగం నన్ను కలవరపెట్టి నిలువనివ్వకుండా చేస్తే ఏదో ఆలోచిస్తూ ముభావంగా వుండేదాన్ని. మా స్నేహితులంతా ఎగతాళి చేసేవారు. ''ఈ అమ్మాయికి ఇప్పుడు ఓ బుజ్జి కవిత పిల్ల పుట్టేట్టుంది. లేబర్ పెయిన్స్ స్టార్ట్ అయ్యాయి. పట్టుకోవడానికి పేపర్, సక్ చెయ్యడానికి పెన్ను సిద్ధం చేసుకోండి'' అంటూ మా ఫ్రెండ్ పద్మ హాస్యమాడేది.

అలా అలా ఫైనలియర్‌కి వచ్చేశాం. ఆ బిజీలో నువ్వు గుర్తొచ్చినా, మెడిసిన్ పాస్ అవ్వాలని నీవు చెప్పిన మాటలు గుర్తొచ్చి ఆగిపోయేదాన్ని. మేము కలవాలని వుంటే కాలమే మమ్మల్ని కలుపుతుంది అని పెద్ద వేదాంతిలా సరిపెట్టుకున్నాను. నీ నుంచి కొన్ని ఉత్తరాలు వచ్చాయి. ఫోన్లు చేశావు. కాని నేను నీతో సరిగ్గా మాట్లాడలేదు. నీవు హర్ట్ అయ్యావేమో ఆ తరువాత నీ నుంచి ఫోన్లు ఉత్తరాలు రావడం మానేశాయి.

అలా ముగిసిన మన ప్రేమకథ ఒక తెగని జ్ఞాపకంలా నన్ను నిరంతరం వెంటాడుతూనే వుంది. పది సంవత్సరాలపైనే అయినా ఆ జ్ఞాపకాలన్నీ నా ఎదుట సజీవంగా నిలిచివున్నాయి. ఈమధ్యనే నీ గురించిన వార్తలు కొన్ని తెలిసాయి. వైజాగ్ అంటే గుర్తొచ్చే మొదటి వ్యక్తివి నీవే. వాళ్ళకి నీవు సీనియర్‌వో, జూనియర్‌వో అయివుంటావని ఎవరు ఫ్రం వైజాగ్ అని తెలిసినా నీ గురించి అడిగేదాన్ని. వాళ్ళ ద్వారానే నీవు నీ మరదలు రజనీనే పెళ్ళి చేసుకున్నావని, జాబ్ చేస్తున్నావని తెలిసింది. చాలా సంతోషించాను.

నా గురించి తెలుసుకోవాలని వుందికదూ. నేను మెడిసిన్ కంప్లీట్ చెయ్యగానే ఇంట్లో పెళ్ళి గురించి చర్చ మొదలయ్యింది. కొన్ని సంబంధాలు వాళ్ళకే నచ్చలేదు. ఏదీ నచ్చకూడదని కోరుకుంటూ వుండేదాన్ని. ఏ మూలో ఆశ. నీవు నీ మరదల్ని కాదని నేనంటేనే ఇష్టమని, నేనే కావాలంటూ నా కోసం వచ్చేస్తావేమోనని. అమ్మా నాన్నతో చెప్పి వాళ్ళని ఒప్పించి నన్ను తీసుకెళ్ళి పోతావేమోనని.



## మణి ప్లానింగ్

మణిరత్నం తీసిన 'యువ' హిట్ కాకపోయినా ఫ్లాప్ మాత్రం కాదు. ఆ సినిమాని పాటలే లేకుండా తీయాలని మొదట మణి ప్లాన్ చేశాడు. అయితే ఎ.ఆర్. రెహమాన్ ఇచ్చిన ట్యూన్స్ విని పాటలు పెట్టకుండా వుండలేకపోయాడట. ఎంబిఏ చదువుకున్న మణి సార్ సినిమా నిర్మాణంలో చాలా ప్లానింగ్‌గా వుంటాడు. మనం చదువుకున్న చదువు ఎక్కడో ఒకచోట ఉపయోగపడుతుందనంటాడు మణిరత్నం. సెట్స్‌కొచ్చిన తరువాత సినిమా గురించి చర్చించడం ఆయనకిష్టముండదు. షూటింగ్ జరుగుతున్నప్పుడు వచ్చే ఐడియాలను అమలుపరచడం మంచిపద్ధతి కాదంటాడు.



## షారూఖ్ ఒక్కడే హీరో

బాలీవుడ్‌లో సొంతంగా సినిమాను హిట్ చేయగలిగే శక్తి షారూక్ ఒక్కడికే వుందని బిపాసా బసు అభిప్రాయం. మిగతా ఏ యాక్టర్‌కైనా కాంబినేషన్ అవసరం అంటోంది. ఈమధ్య వరసగా మీ సినిమాలు ఎందుకు ఫ్లాపవుతున్నాయని అడిగితే నన్నొక్కదాన్ని చూసి సినిమాకు వస్తారా? మిగతా అందరి కాంబినేషన్ కలవాలిగా అంది. బాలీవుడ్‌లో హాట్‌సీన్స్‌కి తెరలేపింది తానేనని వాదిస్తుంది బిపాసా. మరి ఆమెకంటే ముందు అందాలు ఆరవేసినవారి మాటేమిటో?

కాని నా ఆశ ఫలించలేదు. నా నిరీక్షణ వృథా అయింది. చివరికి నా వయసు, బాధ్యతలు ఇంకా నిరీక్షించేందుకు అనుమతించలేదు. అందుకే పెళ్ళికి ఒప్పుకున్నాను. ఒక విధంగా నేనూ అదృష్టవంతురాలినే. మానవత్వపు విలువలు మెండుగా వున్న ఒక మంచి మనిషి నాకు భాగస్వామి అయ్యాడు. మంచి కళాభిరుచి వున్న వ్యక్తి. నేనంటే చాలా ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాడు. నేను కోరుకున్న వ్యక్తికి దూరమైనా నన్ను కోరుకున్న వ్యక్తికి దగ్గరైనందుకు సంతోషించాను.

తరువాత పిజికి ప్రిపరేషన్. సీటు రావడం, పిల్లలు పుట్టడం, ఇలా ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి. నిజానికి నాకింకేం అవసరం లేదు. కాని ఈమధ్య నాలో తరుచుగా రగులుతున్న అసంతృప్తి. నీ గురించి మళ్ళీ మొదలైన ఆలోచనలు. నేను నీకు గుర్తున్నానో లేదోగాని, నాకు నీ మాటలు, నీ చూపులు, నీ నవ్వు, ఒక్కటేమిటి అన్నీ గుర్తొస్తున్నాయి. నీవు నాకో తెగని జ్ఞాపకానివి. నాకు తొలివలపు రుచి చూపిన చెలికాడివి. నా చేతిమీద నీ తొలిముద్దు ముద్రవేసి ఆ మైమరపుని నాలో కలిగించిన ప్రియసఖుడివి. నిజం... నీ మీద ఒట్టు.. నీ చేతి స్పర్శ నా చేతిని అంటిపెట్టుకున్నట్లే వుంది ఇంకా కొత్తగా. ఏయ్ మొద్దూ! ఒక్కసారి నాకు కనిపించకూడదూ... ఆ వయసులో ప్రతిదీ నవ్వుగానే వుండేది. ప్రతిదీ అందంగానే కనిపించేది. ఇప్పుడు దేన్ని చూసినా నిరాసక్తతే. ఎందుకంటావ్? ఆ ఫీలింగ్‌ని పంచుకునే మనిషి ఎదుట లేకనా?

ఉదాహరణకి, నాకేమో వర్షం పడే సాయంత్రం, లైఫ్ ఎంత బిజీగా వున్నా కూడా, మావారితో కలిసి వేడి వేడి పకోడీలు తింటూ, కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకోవాలని, తనతో కలిసి పాత పాటలు వినాలని చాలా ఇష్టం. కాని తనకేమో.. ఆ టైంలో ఫ్రెండ్స్‌తో ఊరిబయట కెళ్ళి అక్కడ వారితో కలిసి టీ తాగుతూ, జోక్స్ కట్ చేసుకుంటూ స్పెండ్ చేయడం ఇష్టం. ఎవరి ఆలోచనల్లోను తప్పులేదు. ఇచ్చిన ప్రిఫరెన్సులోనే వుంది పొరపాటంతా.

మావారిగురించి చెప్పనా! నిజానికి చాలా మంచి వ్యక్తి. డాక్టరుగానే కాదు మంచి మనిషిగా చాలామందితో పరిచయమున్నవ్యక్తి. తనకి పెద్ద రచయితలతో, గొప్ప కళాకారులతో పరిచయం, తనకి టైం మిగిలితే వాళ్ళతో గడపడానికే ఎక్కువ ఇష్టపడతాడు. వాళ్ళకే ప్రాధాన్య ఇస్తారు. నాతో గడపాలంటే తనకి బోర్. నిజమే అయివుండచ్చు. నాదగ్గర తనకు ఆసక్తిని కలిగించే క్వాలిటీస్ ఏమీలేవు. ఏవో ఆరోజు వచ్చిన కేసుల గురించి చెప్పడం, పిల్లల అల్లరి గురించి ఫిర్యాదు చేయడం తప్ప. తను నన్ను అవాయిడ్ చేస్తున్నట్లు ఫీలింగ్. నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారనిపించి మనసులో అసంతృప్తి పేరుకొని పోతుంది. నేను ఒకప్పుడు తీసుకున్న నిర్ణయం తప్పేమో అనే ఆలోచన మొదలైంది.

చందూ! ఎక్కడున్నావ్‌రా. ఇప్పుడు మనం కలిసి వుంటే సంతోషంగా వుండేవాళ్ళమా. ఈ అసంతృప్తి, ఈ అవాయిడ్ చెయ్యడం, ఈ నిర్లక్ష్యం ఏవీ వుండేవి కావా. అంత ఖచ్చితంగా వుండవని చెప్పలేను కాని, ఒకరిపట్ల ఇంకొకరికి ప్రైమ్ ఇంపార్టెన్స్ వుండేది. మన కలయిక వెనుక ఎంతో స్ట్రగుల్ వుండేది. కాబట్టి ఆ సంతోషాన్ని కలకాలం నిలుపుకోవాలని, అశ్రద్ధ చేయరాదని ఓ నిర్ణయం తీసుకుని వుండేవాళ్ళం. ఏమంటావ్? అప్పుడు కూడా ఇలాంటి పరిస్థితి వచ్చేదంటావా. ఏమో! మనం ఒకరికొకరం పూర్తిగా తెలియకముందే విడిపోయాం. అందుకేనేమో నీవంటే అంత అభిమానం. నీ జ్ఞాపకాలు అంత అపురూపం. నీ మాటలు అంత మధురం. కాని ఎంత కాదనుకున్నా ఒకరంటే ఒకరికి ఇష్టం కాబట్టి ఆ తొలివలపును రోజూ పండించుకునే వాళ్ళమేమో. ముద్దులు, ముచ్చట్లు, మురిపాలు, కోపాలు, తాపాలు, గిల్లికజ్జాలు, చిలిపి సయ్యాటలు, వియోగాలు ఎన్నో అపురూపమైనవి అనుభవానికి వచ్చేవి. ఇప్పుడు అవన్ని జ్ఞాపకాల్లో ఊహల్లో నిలిచిపోయాయి. నిజం... నీ దొంగచూపుల సాక్షిగా నీ వన్నట్లు నా బెదురు చూపుల కళ్ళతో నిన్ను చూసినప్పుడు కళ్ళు... కళ్ళు కలుసుకొని ఒళ్ళు జల్లుమనడం, ఇప్పటికీ కొత్తగానే వుంది.

అన్ని విషయాలు మనమధ్య జరిగినవే అయినా వాటినే ఎందుకు రాశానో తెలుసా? నీకు గుర్తున్నా, మళ్ళీ నా నుంచి వినడం ద్వారా ఆ ఫ్రెష్‌నెస్. ఆ అనుభూతి నీ మనస్సులోకి రావాలని, ఇదంతా చదివాక నీ గుండెల్లోని తడి కళ్ళకి చేరి అది వర్షపు చినుకై నా చెక్కిట పడితే నా ప్రయత్నం ఫలించినట్లే.

ఆ రోజుల్లో ఎప్పుడూ మౌనంగా నీ మాటలు వింటూ వుండేదాన్ని. కాని ఇప్పుడు అటువంటి ఆవకాశం వస్తే గలగల మాట్లాడుతూ, ఫ్రీగా, సరదాగా ఏ భయం లేకుండా కబుర్లు చెబుతాను. అప్పట్లో నా మనసులోని భావానికి, నీ కళ్ళల్లో ప్రతిఫలించే భావానికి సరిపోతుందా అని ఆలోచించడానికే సరిపోయేది. ఇలా పరిపరి విధాలా ఆలోచించుకుంటూ, తీరా ఆ భావాలన్నింటిని సమీకరించి వ్యక్తపరిచే సమయానికి నా ఆశని తెంపేసి, నా కలల్ని కళ్ళల్లోనే నిలుపుకొమ్మని, నిరీక్షణే శిక్షగా వేసి, కన్నీటిని నాకు తోడుగా వుంచి నీవు దూరంగా వెళ్ళిపోయావు. మనుషుల మధ్య దూరం మనసుల్ని కూడా ఎడం చేస్తుందా. అయినా... చందూ... నేనే నిన్ను దూరం చేసుకున్నాను.

మా వారితో మన ప్రేమ సంగతంతా చెప్పేసాను.

ఓపిగ్గా విని ''వచ్చే జన్మలో శరత్ చంద్ర ఎక్కడున్నా వెతికి నీకు గిఫ్ట్‌గా ఇస్తాను'' అన్నారు. కాని చందూ! వచ్చే జన్మవరకు నిరీక్షించేందుకు ఓపికలేదు. నిన్ను చూడకపోయినా, నీతో నా అనుభూతుల్ని, ఆనాటి రోజుల్ని పంచుకోవాలని ఆరాటంగా వుంది. ఈ నా ఉత్తరం చేరగానే నాతో మాట్లాడతావా. ఎవరో పరాయివ్యక్తి అని ఊరుకుండిపోతావా? నీకు నేను పరాయిదాన్నా? అలా అనుకోడానికి చాలా బాధగా వుంది. కొన్ని వాస్తవాలు అంతే చాలా చేదుగా వుంటాయి వాస్తవానికి.

నీ కంఠం వినాలని, నీచేత సరదాగా ఏడిపించబడాలని, నీమీద కోపగించుకోవాలని, నా చిట్టి పాపని, బాబుని నీకు చూపించాలని, నా కెరియర్ గురించి నీకు చెప్పాలని, ఇంకా ఏంటో, అన్ని విషయాలు నీకు వివరించాలని వుంది. మళ్ళీ నీ స్నేహం కోసం చేయి చాస్తున్నాను. అందించవూ.. నీ ప్రేమను కొంచెం నాకూ పంచవూ.. ఇక వుంటాను. చందూ! మళ్ళీ ఈ వసంతానికి వెన్నెలను జత చేయవూ..

ఇట్లు
నీవు తోడుగా వుంచి వెళ్ళిన కన్నీటి సాక్షిగా
నీ నిరీక్షణలోనే నిన్నెక్కువగా ప్రేమించిన..
వసూ